క్లుప్తంగా

వేసవిలో చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• కావలి డీఎస్పీ శ్రీధర్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

కావలి: వేసవిలో దొంగలు ఎక్కువగా చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కావలి డీఎస్పీ శ్రీధర్ సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. వేసవిలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు తమ విలువైన వస్తు సామగ్రిని జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. వీలైనంత వరకు బంగారు, వెండి ఆభరణాలను లాకర్లలో భద్రపరుచుకోవాలని, లేకపోతే తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో ఇళ్లలో ఉంచి ఊర్లకు వెళ్లొద్దని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా లేదా సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం అందజేస్తే తమ సిబ్బందితో నిఘా ఉంచుతామని తెలిపారు. అలాగే ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోగలిగితే దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను వెంటనే పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆరుబయట నిద్రించే వారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మహిళలు విలువైన ఆభరణాలను ధరించి నిద్రించరాదని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే చుట్టుపక్కల వారు వెంటనే '100'కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పరామర్శ

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలో బుధవారం జరిగిన రాపూరు శేషారెడ్డి ఉత్తరక్రియల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. శేషారెడ్డి కుమారుడు రాపూరు నాగరాజారెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, నాయకులు సద్దా రవీంద్రరెడ్డి, బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ

దుత్తలూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై పీ ఆదిలక్ష్మి చేతుల మీదుగా త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఎస్సైకు క్యాలెండర్‌తో పాటు త్రైత సిద్ధాంత పుస్తకాలను సభ్యులు అందజేశారు. సభ్యులు జి.ప్రసాద్, సుధాకర్, పెంచలరత్నం పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న కారు


• దంపతులకు తీవ్రగాయాలు

కోవూరు : ఆగిఉన్న స్కూటీని కారు వేగంగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన కోవూరు జాతీయ రహదారి సమీపంలోని ఓ హోటల్ వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. రాజుపాళెనికి చెందిన పెంచలయ్య, భారతి దంపతులు పనినిమిత్తం స్కూటీపై నెల్లూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో కోవూరు పరిధిలోని ఓ హోటల్ వద్ద నిలిపి ఉన్న వాహనం వద్దకు స్కూటీ వచ్చి ఆగింది. అదే సమయంలో అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొట్టింది. దీంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును డ్రైవర్ హితేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోండి

కొడవలూరు : బీపీటీ–5204 వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని ఏఓ లక్ష్మి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెం, తలమంచి గ్రామాల్లో కళ్లాల్లోని ధాన్యాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. బీపీటీ రకానికి మార్కెట్‌లో ధర నిరాశాజనకంగా ఉన్నందున కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవడం ద్వారా మద్దతు ధర పొందాలన్నారు. తేమ శాతం విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావల్సిన అవసరం లేదన్నారు. వీఏఏలు ప్రసాద్, శివజ్ఞాన ఉన్నారు.

సునీత విలియమ్స్ రాకపై హర్షం



బుచ్చిరెడ్డిపాళెం : అంతరిక్షంలో అద్భుత పరిశోధన కోసం వెళ్లిన వ్యోమగామి సునీత విలియమ్స్ సురక్షితంగా భూమిపైకి తిరిగిరావడంతో బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో కలాం పురస్కార గ్రహీత గండికోట సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సునీత విలియమ్స్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఆమె గురించి విద్యార్థులకు వివరించారు.

ఇష్టారాజ్యంగా విధులు

• సమయాన్ని పాటించని సచివాలయ సిబ్బంది
• సర్వేల పేరుతో సచివాలయాల్లో అందుబాటులో ఉండని వైనం
• సగానికిపైగా పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులే దిక్కు
• సేవలందక ప్రజలు ఇక్కట్లు



గానుగపెంట గ్రామ సచివాలయం

కొండాపురం : ఉదయగిరి నియోజకవర్గంలో గ్రామసచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామసచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన వారు పత్తా లేకుండా పోతున్నారు. ఉదయం 10 గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉన్నా.. 11 గంటల వరకు కూడా కనిపించడంలేదు. సర్వేలు, ఫీల్డ్‌విజిట్ల పేరుతో సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. దీనికితోడు సగానికిపైగా పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులే కావడంతో సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సగానికిపైగా పంచాయతీల్లో ఇన్‌చార్జి కార్యదర్శులే

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలోని ఎక్కువ శాతం గ్రామ పంచాయతీల్లో ఇన్‌చార్జి కార్యదర్శులే కొనసాగుతున్నారు. కొండాపురం, వరికుంటపాడు, కలిగిరి, సీతారామపురం మండలాల్లో సగానికిపైగా పంచాయతీల్లో ఇన్‌చార్జి కార్యదర్శులే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పంచాయతీల్లో పాలన అంతంత మాత్రంగా సాగుతోంది.

సర్వేల పేరిట కాలక్షేపం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొమ్మిది నెలలుగా గ్రామ సచివాలయాల నుంచి పెన్షన్లు పంపిణీ తప్పా ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదు. సచివాలయం ఉద్యోగులకు కచ్చితమైన జాబ్‌చార్ట్ సైతం ఇవ్వలేదు. కానీ జియో ట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్, పీఏసీఎస్, నాన్ రెసిడెన్స్ ఆఫ్ ఏపీ, ఆధార్ లేని 6 ఏళ్లలోపు పిల్లలు గుర్తింపు, పీ–4, తదితర సర్వేల విధులను సిబ్బందికి ఇచ్చారు. ఈ సర్వేల పేరుతో సిబ్బంది సచివాలయంలో లేకుండా బయటే కాలక్షేపం చేస్తున్నారు. సర్వేల్లో సైతం ఎలాంటి పురోగతి ఉండడం లేదని సమాచారం. ఇప్పటికీ గ్రామాల్లో మిస్సింగ్ సిటిజన్లు, ఆధార్ లేని పిల్లల వివరాలు పూర్తి స్థాయిలో తెలియదంటే సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఇక సచివాలయానికి, పీహెచ్‌సీలకు అనుబంధంగా ఉన్న ఎంఎల్‌హెచ్‌లు ఏం విధులు నిర్వర్తిస్తున్నారో అర్థం కానీ పరిస్థితి. ఎంఎల్‌హెచ్‌లపై పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడింది. దీంతో వారు ఎప్పుడు విధులకు వస్తారో..ఎక్కడుంటారో తెలియడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమాచారం

మండలం	పంచాయతీలు	రెగ్యులర్ కార్యదర్శులు	ఇన్‌చార్జి కార్యదర్శులు
కొండాపురం	19	12	7
కలిగిరి	23	14	9
వింజమూరు	12	10	2
దుత్తలూరు	11	11	0
వరికుంటపాడు	24	17	7
ఉదయగిరి	17	9	8
సీతరామపురం	14	8	6
జలదంకి	17	16	1

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

గ్రామ సచివాలయ సిబ్బందిపై ఎంపీడీఓ, డీఎల్‌డీఓల పర్యవేక్షణ కొరవడింది. ఈ కారణంగా సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలానికి ఎప్పుడో ఒక్కసారి తనిఖీలకు వచ్చే డీఎల్డీఓలు మండల కేంద్రంలోని సచివాలయాలను పర్యవేక్షిస్తున్నారే తప్ప మిగిలిన పంచాయతీల్లోని సచివాలయాలను తనిఖీ చేయడం లేదు. దీంతో సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండక ఖాళీ కుర్చీలు దర్శమిస్తున్నాయి. ఎంపీడీఓలు సైతం సచివాలయ సిబ్బంది హాజరును ఆన్‌లైన్‌లో చూస్తున్నారే తప్ప క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయడం లేదు.దీంతో సిబ్బంది వారి ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

విమానాశ్రయ భూసేకరణలో మెక్కిన మాలేపాటి

కావలి: దగదర్తి విమానాశ్రయ భూముల్లో అక్రమంగా సంపాదించింది నువ్వు కదా అని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి నిలదీశారు. కావలిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాలేపాటిపై పమిడి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విమానాశ్రయ భూసేకరణకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీలు, ఇతరుల భూముల్లో 30 శాతం కమీషన్లు వసూలు చేయలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికీ 30 కమీషన్ ఇస్తేనే భూసేకరణ తాలూకా నగదు భూయజమానులకు దక్కేలా 150 ఎకరాలకు అగ్రిమెంట్ రాసుకుని పెట్టుకుని ఉన్నది నిజం కాదా అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి డీఆర్ చానల్ బ్రిడ్జిని కూలగొట్టారని మాలేపాటి విమర్శిస్తున్నారని, మార్చి దాటితే నిధులు మురిగిపోతాయనే బ్రిడ్జిని కూల్చి నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. డీఆర్ చానల్ పనులకు సంబంధించి మాలేపాటి కమీషన్ డిమాండ్ చేయగా, కాంట్రాక్టర్ నిరాకరించడంతో పనులు నిలిపివేయించి డ్రామాలు ఆడుతూ అందర్నీ నిందిస్తున్నాడని ఆరోపించారు. ఇరిగేషన్ ఎస్ఈను సైతం మంత్రి లోకేష్‌ను కలిసి నిన్ను అనంతపురం ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని మాలేపాటి బెదిరిస్తున్నాడని, నీకు కమీషన్లు ఇవ్వకుంటే అధికారులను ట్రాన్స్‌ఫర్లు చేయిస్తావా అంటూ నిలదీశారు. దగదర్తిలో మద్యం షాపు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తే, తనకు 30 శాతం వాటా ఇవ్వాలని లేకపోతే రూ.10 లక్షలు కమీషన్ ఇవ్వాలని మాలేపాటి డిమాండ్ చేశాడని, అందుకు అంగీకరించకపోవడంతో మద్యం షాపును పెట్టనివ్వనని, అడ్డుకుంటానని బ్లాక్‌మెయిల్ చేశాడని ఆరోపించారు. ఎన్నిక సమయంలోనూ మాలేపాటి బ్లాక్ మెయిల్ రాజకీయంతో పబ్బం గడుపుకున్నారన్నారు. డీవీ కృష్ణారెడ్డిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తే స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్‌కు మద్దతుగా నిలిచింది వాస్తవం కాదా..అందుకు ఆధారాలు సైతం తన దగ్గర ఉన్నాయంటూ మాలేపాటి తెరచాటు వ్యవహారాలను బహిర్గతం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల కష్టాన్ని నువ్వు ఒక్కడివే ఎన్నికలకు ముందు డీవీ కృష్ణారెడ్డికి అమ్ముకున్నది వాస్తవమా...కాదా అని మాలేపాటిని నిలదీశారు. 'పార్టీ కోసం రూ.14.77 కోట్లు ఖర్చు పెట్టా, నాకు ఆ నగదు కృష్ణారెడ్డి ఇస్తేనే పార్టీ జెండా కట్టిస్తాను, నన్ను కాదని జెండా కట్టిన వారిని ఇరగదీస్తా' అని మాట్లాడింది వాస్తమా.. కాదా అని మాలేపాటిని ప్రశ్నించారు. మాలేపాటికి డబ్బులు ఇవ్వొద్దని చంద్రబాబు నాయుడు చెప్పినా తామందరం కృష్ణారెడ్డికి నచ్చజెప్పి రూ.3 కోట్లు అర్ధరాత్రి వేళ అందజేస్తే తీసుకుంది నిజం కాదా అని నిలదీశారు. పెట్రోల్‌కు రూ.25 లక్షలు ఇస్తేనే ప్రచారం చేస్తానని కిరికిరి చేస్తే అది కూడా ఇచ్చినట్లు తెలిపారు. మళ్లీ రూ.30 లక్షలు ఖర్చు అని చీటి చూపిస్తే రూ.10 లక్షలు ఇస్తే తీసుకున్నావని ఆరోపించారు. మళ్లీ ఎన్నికల ప్రచారం చేయనని మొండికేసి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వద్ద రూ.1.40 కోట్లు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మాలేపాటి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు వస్తే బ్లాక్ మెయిల్ చేయడం, పార్టీ అభ్యర్థుల నుంచి నగదు వసూళ్లు చేసుకోవడం రివాజైపోయిందని విమర్శించారు.

ధరలు తగ్గించి దళారుల దోపిడీ



దళారులకు విక్రయించేందుకు తోలిన ధాన్యం

సోమశిల: అనంతసాగరం మండలంలోని వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే అదనుగా దళారులు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం ధరలను తగ్గించేశారు. ఈ ఏడాది దిగుబడులు అంతంత మాత్రంగా ఉన్నాయి. దీనికి తోడు దళారులు ధాన్యం ధరలను తగ్గించడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో తొలుత అడపాదడపా కోతలు జరుగుతున్న సమయంలో కేఎస్ఆర్(తెలంగాణ మసూరి) రకం పుట్టి ధర రూ.20వేలు, కేఎస్ఎం (నెల్లూరు క్రాస్) రకం ధర రూ.17వేల నుంచి రూ.18వేల వరకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో దళారులు కుమ్మక్కై కేఎస్ఎం రకం ధరలను పూర్తిస్థాయిలో తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో కేఎస్ఎం రకాన్ని సాగు చేసి ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిద్దామంటే నిబంధనలు, ధాన్యాన్ని ఎండపోసే పాట్లు పడలేక కళ్లాల్లోనే దళారులు ఇచ్చిన ధరకు తెగనమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం ధరలు పుట్టి రూ.22వేల నుంచి రూ.24వేల వరకు ధరలు ఉండడంతో మంచి ఆదాయం వచ్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలు పడిపోవడంతో నష్టపోతున్నామని వారు వాపోతున్నారు.

వెంగళరావునగర్‌లో క్షుద్రపూజల కలకలం

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లోని బ్రహ్మేంద్రస్వామి మందిరంలో క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారని, దానిపై విచారణ జరపాలని స్థానికులు కావలి రెండో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరం జనసంచారం లేని ప్రదేశంలో ఉంది. మందిరం వద్దకు ఇతర ప్రాంతాలకు చెందిన అపరిచిత వ్యక్తులు రాకపోకలు సాగిస్తుండడం, జన సంచారం లేని చోట చేయాల్సిన పూజలను మందిరంలో చేస్తుండడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. తమపై చెడు ప్రభావం చూపుతుందనే భయంతో వణికిపోతున్నారు. పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీఎల్వోలతో సమీక్ష

దుత్తలూరు: మండల పరిషత్ కార్యాలయంలో బూత్‌లెవల్ ఆఫీసర్లతో తహసీల్దార్ యనమల నాగరాజు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని చనిపోయిన ఓటర్లను గుర్తించి తొలగించాలని సూచించారు. ఇంటి డోర్ నంబర్లు, ఫారం–8కు సంబంధించిన సవరణలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఉదయగిరి : ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీఓ అప్పాజీ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో కోటి రూపాయల మేర అవినీతి జరిగినట్లు తేలడంతో అందుకు బాధ్యులైన అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఆ తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి పనుల్లో క్షేత్రస్థాయిలో అవకతవకలు జరగకుండా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై ఫిర్యాదు

కావలి: పట్టణంలోని గాయత్రీనగర్‌కు చెందిన వివాహిత తనను అదనపు కట్నం తేవాలని అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారని ఒకటో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. తనకు ఒంగోలుకు చెందిన యువకుడితో మూడేళ్ల కిత్రం వివాహమైందని, అప్పట్నుంచి అదనపు కట్నం కోసం తనను అత్తింటి వారు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పది పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో బుధవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు డిప్యూటీ డీఈఓ జానకీరామ్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 160 మందికిగానూ 158 మంది, శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పరీక్ష కేంద్రంలో 152 మందికి గానూ ఇద్దరు, సెయింట్‌మేరీస్ పాఠశాలలో 156 మందికి ఒకరు, శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 125 మందికి ఒకరు గైర్హాజరయ్యారని వివరించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 72 మందికి 72 మంది , ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 130 మందికి 130 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షల నిర్వహణను డిపార్ట్‌మెంటల్ అధికారి మాలకొండయ్య, పరీక్షల చీఫ్ అనంతలక్ష్మి పర్యవేక్షించారు.

గృహ లబ్ధిదారులకు అదనపు సాయం



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరు: ప్రభుత్వ గృహ నిర్మాణాలను అసంపూర్తిగా నిలిపివేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వాటిని పూర్తిచేసుకునేందుకు ప్రభుత్వం అదనపు సాయాన్ని అందజేస్తోందని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని కరటంపాడు, బోయలచిరివెళ్ల గ్రామాల్లో సచివాలయాల సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. పీ–4 సర్వే పూర్తయితే లబ్ధిదారుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే నమోదు చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అసంపూర్తి గృహాలను పూర్తి చేసుకునేందుకు ఎస్టీలకు రూ.75వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50వేలు చొప్పున అదనపు సాయం అందజేస్తోందని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహాలను పూర్తి చేసుకునేలా చూడాలని కోరారు.

హైవే పనుల్లో నాణ్యత లోపం



వింజమూరు చెరువుపై వంతెన వద్ద దెబ్బతిన్న రివెట్‌మెంట్

వింజమూరు(ఉదయగిరి): దుత్తలూరు నుంచి కావలి వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. వింజమూరు చెరువు కట్టపై చేపట్టిన సిమెంటు పనుల్లో నాణ్యతలోపం స్పష్టంగా కనిపిస్తోంది. వంతెన వద్ద జరిగిన పనుల్లో పగుళ్లు కనిపిస్తున్నాయి. రివెట్‌మెంట్ మూణ్నాళ్లకే దెబ్బతింది. ఓ వైపు పనులు జరుగుతుండగా మరో వైపు పనుల్లో డొల్లతనం బయటపడుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనుల నాణ్యతపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

కొలతలు వేశారు..రోడ్డు నిర్మాణాన్ని మరిచారు



జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలోని అరుంధతీయవాడ ప్రాథమిక పాఠశాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాల నుంచి పీహెచ్‌సీ వరకు గ్రామనత్తం స్థలంలో రోడ్డు నిర్మాణానికి అధికారులు కొలతలు వేశారు. 200 అడుగుల దూరం 15 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణాన్ని త్వరలోనే చేపడుతామని హామీ ఇచ్చారు. ఆ తరువాత ఏమైందో ఏమో రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ రోడ్డు ఏర్పాటు వల్ల అరుంధతీయ కాలనీవాసులతో పాటు గ్రామప్రజలకు కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు దారి దగ్గరవుతుంది. గతంలో రోడ్డును నిర్మించాలని అరుంధతీయ కాలనీవాసులు కావలి ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. అనంతరం రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపి కొలతలు వేశారు. కానీ రోడ్డును ఏర్పాటు చేయలేదు. పలువురు టీడీపీ నాయకులు రోడ్డు ఏర్పాటుకు అడ్డుకట్ట వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న పీడీ వేణుగోపాల్

అల్లూరు: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవతం చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలోని బీఎమ్మార్ కాలనీలోని ఎస్టీ గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం గృహ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు రూ.1.80లక్షలను మంజూరు చేస్తోందని తెలిపారు. దీనికి అదనంగా ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల చొప్పున మంజూరు చేస్తోందని వివరించారు. జూలై మొదటి వారంలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. అలాగే లబ్ధిదారులకు అవగాహన కల్పించి అసంపూర్తి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

యథేచ్ఛగా తిప్ప ఆక్రమణ

• ఇద్దరు కౌన్సిలర్ల ప్రమేయం
• పట్టించుకోని అధికారులు



తిప్పను యంత్రాలతో చదును చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ప్రకృతి సంపదలను కొల్లగొట్టడంతో పాటు ప్రభుత్వ భూములు కనిపిస్తే ఆక్రమించి పాగా వేస్తున్నారు. చోటామోటా నాయకుల నుంచి మండల స్థాయి నాయకుల వరకు ఇదేతరహాగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఈసడించుకుంటున్నారు. మున్సిపల్ పరిధిలోని 15,18 వార్డుల పరిధిలో సుమారు 25 ఎకరాల్లో తిప్ప విస్తరించి ఉంది. పట్టణ నడిబొడ్డున ఉన్న తిప్ప దిగువ ప్రాంతంలో ఇప్పటికే పలువురు పేదలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం పైప్రాంతంలో పాత ఆర్డీఓ ఆఫీసు సమీప రోడ్డులో ఆక్రమణలు జోరందుకున్నాయి. తిప్ప శిఖర ప్రాంతంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో గత రెండ్రోజులుగా జేసీబీతో తిప్పను తవ్వి చదును చేస్తున్నారు. తవ్విన గ్రావెల్‌ను ట్రాక్టర్ల ద్వారా ప్లాట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ మద్దతు కౌన్సిలర్లు ఇద్దరు ఈ పనులు చేయిస్తుండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతానికి సమీపంలో ఓ కౌన్సిలర్ స్థలాన్ని ఆక్రమించి దర్గాను నిర్మించి ఉన్నారు. ప్రస్తుతం దర్గాకు ఎదురువైపున ఉన్న స్థలాన్ని ఆక్రమించి చదును చేస్తున్నారు. యథేచ్ఛగా తిప్పను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.